క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

గంగవరం: మండలంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గురువారం పర్యటించనున్నారు. మర్రిపాలెం పంచాయతీలో కొమరవరం, మర్రిపాలెం, ఎల్లాపురం గండి గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు. కార్యకర్తలు, గ్రామ సచివాలయ ఇన్‌చార్జీలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి రాజశ్రీ

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ పంచాయతీ కించుమండ, శివనగరం, కొసోంగుడ తదితర గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధకశాఖ వైద్యాధికారి రాజశ్రీ మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. పాడి రైతులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని, పశువులకు వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. సిబ్బంది దివ్య, త్రినాథరావు, సంజీవ్, అప్పారావు, అనంతరావు, రత్నం, బాలు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



శెట్టిబంధ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న స్తంభాలు

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రా పంచాయతీ శెట్టిబంధ, కొర్రా గ్రామాల్లో విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విద్యుత్ స్తంభాలు లేక పోవడంతో ఇబ్బందులు పడేవారన్నారు. ప్రభుత్వం మంజూరు చేయడంతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటుతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

విజేతలకు బహుమతులు



బహుమతులతో విద్యార్థులు, చిత్రంలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్, అధ్యాపకులు

అరకులోయ రూరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నెహ్రూ యువ కేంద్రం (విశాఖపట్నం) ఆధ్వర్యంలో కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ బహుమతులు అందజేశారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి, పీడీలు అప్పారావు, నారి తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలపై అవగాహన



గ్రామస్తులతో మాట్లాడుతున్న హెచ్ఎం భూషణ్, మహిళా పోలీసు గిరువాణి

ముంచంగిపుట్టు: అత్యవసర సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెచ్ఎం వి.భూషణ్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కోడాపుట్టు గ్రామంలో బుధవారం హెచ్ఎం భూషణ్, మహిళా పోలీసు బి.గిరువాణిలు 108, 104 అంబులెన్స్‌లు, 100 సేవల వల్ల కలిగే ఉపయోగాలను గ్రామస్తులకు వివరించారు. ప్రతి ఒక్కరూ అత్యవసర సేవలు ఎలా పొందాలో తెలుసుకొని వినియోగించుకోవాలని, నిత్యం సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

ఏళ్ల నాటి కల.. నెరవేరిన వేళ



భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి వేసిన బీటీ రోడ్డు

- భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి రోడ్డు
- తీరనున్న 86 గ్రామాల రవాణా సమస్య
- ఆనందంలో గిరిజనులు

ముంచంగిపుట్టు: స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా ఆ గ్రామాలకు పక్కా రహదారి సౌకర్యం లేక ఇన్నాళ్లుగా ప్రయాణానికి పడరాని పాట్లు పడ్డారు. అనారోగ్య బారిన పడిన వారు అధ్వాన దారి పరిస్థితితో సకాలంలో ఆస్పత్రికి చేరలేక మార్గమధ్యంలోనే రోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం.. అదంతా గతం... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాలకు పక్కా రహదారుల కల నెరవేరుతోంది. దశాబ్దాలుగా నెరవేరని కల నేడు కార్యరూపం దాల్చుతుండడంతో ఆ ప్రాంత గిరిజనుల ఆనందానికి అవధుల్లేవు.

నాడు వ్యయప్రయాసాలతో ప్రయాణం : ముంచంగిపుట్టు మండలం అత్యంత మారుమూల ఒడిశా సరిహద్దులో ఉన్న భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేక 15 కిలోమీటర్లు ఎంతో వ్యయప్రయాసలు పడుతూ ప్రయాణం సాగించేవారు. వర్షాకాలం సీజన్‌లో భూసిపుట్టు పంచాయతీలో ఉన్న గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. ఈ పరిస్థితిల్లో రోడ్డు నిర్మాణం కోసం ఈ ప్రాంత 86 గ్రామాల గిరిజనులు నాటి పాలకులు, అధికారుల చుట్టూ తిరిగి వినతులు సమర్పించుకున్నారు.ప్రభుత్వాలు మారుతూ రావడం తప్ప భూసిపుట్టు, జమిగూడ, గిన్నెల కోట పంచాయతీల్లో రహదారి సమస్య తీర్చిన వారైకరువయ్యారు.

కోట్లాది రూపాయలతో రహదారి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపీ మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవతో పీఆర్ ప్రాజెక్టు ద్వారా పెదబయలు మండలం రూడకోట జంక్షన్ నుంచి భూసిపుట్టు పంచాయతీ కేంద్రం మీదగా ఒడిశా సరిహద్దు వరకు 26 కిలోమీటర్ల రోడ్డుకు రూ.15.40 కోట్లు నిధులు మంజూరు చేశారు. రహదారి మార్గంలో కల్వర్టులు, సీసీ రోడ్డు వంటి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రస్తుతం బీటీ రోడ్డును నిర్మిస్తున్నారు.తారు రోడ్డు పనులు జరుగుతుండడంతో ఆ ప్రాంత గిరిజనుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తమ 75 సంవత్సరాల కల నెరవేరుతున్నడడం పట్ల ఆ ప్రాంత గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అరకు ఎంపీ మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. నెలాఖరులోగా నిర్మాణ పనులు పూర్తవుతాయని పీఆర్ ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు.

ఆనందంగా ఉంది



భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి గతంలో సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో 15 కిలోమీటర్ల మేర గెడ్డలు, కొండలు ఎక్కి ప్రయాణం సాగించేవారం. గతంలో మా రవాణా కష్టాలు వర్ణనాతీతం.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీటీ రోడ్డు మంజూరు అవడంతో పాటు నిర్మాణం పనులు చేస్తుండడంతో వ్యయ ప్రయాసలు తగ్గాయి. రోడ్డు సమస్య పరిష్కారమవడంతో ఆనందంగా ఉంది.

– కిముడు రాములమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు, కుమడ సెగ్మెంట్, ముంచంగిపుట్టు మండలం

హామీ నెరవేర్చా..



భూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి రోడ్డు సౌకర్యం అనేది ఈ ప్రాంతానికి చెందిన 80 పైగా గ్రామాల గిరిజనుల చిరకాల వాంఛ. ఎన్నికల ముందు ఈ గ్రామానికి వెళ్లే మార్గాన్ని చూసి ఎంతో బాధ వేసింది. నిత్యావసర సరకులు కూడా తీసుకునేందుకు ఆ ప్రాంత గిరిజనులు అధ్వాన రహదారితో గుర్రాలపై వచ్చి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా భూసిపుట్టు పంచాయతీకు బీటీ రోడ్డు మంజూరు చేసి వేస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు ఆ హామీని నెరవేర్చాను.

– చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యే, అరకు

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ స్వామినాయుడు, పక్కన ఎస్ఐ రాజారావు

కొయ్యూరు: యువత క్రీడల్లో ప్రతిభచాటి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సీఐ స్వామినాయుడు కోరారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యం, ఆరోగ్యం కలుగుతుందన్నారు. కొండగోకిరిలో బీజేపీ నేత లోకులగాంధీ స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకులగాంధీ చిన్నతనంలో పేదరికాన్ని అనుభవించినా స్వశక్తితో ఐఐటీ అభ్యసించిన తొలి గిరిజనుడిగా గుర్తింపు పొందారన్నారు. గిరిజనులకు ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. లోకులగాంధీని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దాని సాధనకు కృషి చేయాలని కోరారు. ఎస్ఐ రాజారావు మాట్లాడుతూ యువత గాంధీని ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లోను రాణించాలని కోరారు. విద్యార్థులు వారి చదువుతోపాటు ఆటలపై దృష్టి సారించాలన్నారు. కొండగోకిరిని దత్తత తీసుకున్న మురళీకృష్ణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూకరాజు, గాంధీ కుటుంబ సభ్యులు లోకుల కిరణ్, రమేష్, యువసైన్యం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు విధిగా పాటించాలి



హెచ్ఎంలకు సూచనలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

దేవీపట్నం: పాఠశాలల్లో ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎంఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. ఇందుకూరుపేటలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధిగా ఫేషియల్ యాప్ నందు హాజరు నమోదు చేయాలని, విద్యార్థుల హాజరు ప్రతిరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, క్యాలండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని, బైజూస్ ట్యాబ్‌లు ప్రతిరోజు ఉపయోగించాలని, జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం అందించాలని తదితర అంశాలపై సూచనలు అందించారు.

పనస అ'ధర'హో




విక్రయానికి సిద్ధంగా ఉన్న కూర పనసకాయలు

- జోరుగా అమ్మకాలు
- ఆశాజనకంగా ధరలు

సాక్షి, పాడేరు: పనసకాయలు గిరిజనులకు ఆదాయాన్నిస్తున్నాయి. ఏడాదిలో రెండు సార్లు పనస కాపు నెలకొంటుంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో కాసే కాయలను లేతదశలోనే కూరల నిమిత్తం అమ్మకాలు జరుపుతారు. వర్షాలు కురిసిన తరువాత జూన్ నుంచి మరో కాపు వస్తుంది. అప్పటి పనసకాయలను పండ్ల రూపంలో అమ్మకాలు జరుపుతారు. ఏడాదిలో రెండు సార్లు పనస గిరిజనులకు మంచి ఆదాయం ఇస్తుంది. ఈ సీజన్‌లో విరగ్గాసే లేత పనస కాయలు అమ్మకాలు ప్రస్తుతం జోరందుకున్నాయి. పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో కూర పనసకాయలకు మంచి డిమాండ్ ఉంది. దీంతో అక్కడి వ్యాపారులు ఏజెన్సీలో గిరిజన రైతుల నుంచి లేత పనసకాయలను సేకరించి కొనుగోలు చేస్తున్నారు. పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ,అనంతగిరి మండలాల్లో గిరిజన రైతులు ప్రతి ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు లేత పనసకాయలు విక్రయించి, మంచి లాభాలు పొందుతుంటారు. ఈ ఏడాది కూడా చెట్లకు లేత పనస కాయలు విరగ్గాయడంతో వాటిని సేకరించి అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం 40 కిలోల బరువు తూగే లేత పనసకాయల బస్తాను సైజును బట్టి రూ.600ల నుంచి రూ.700 ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అరకు, సుంకరమెట్ట, హుకుంపేట వారపుసంతలతో పాటు పాడేరు మండలంలోని దేవాపురం, సలుగు, వంట్లమామిడి పంచాయతీల్లో వ్యాపారులు ఈ లేత పనసకాయలను కొనుగోలు చేస్తు పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆ రాష్ట్రాల్లో కూర పనసకాయలకు ఈ సీజన్‌లో అధిక డిమాండ్ ఉంది.పెళ్లిల్లు, ఇతర శుభకార్యాలకు పనస కూరను వినియోగిస్తారు.

ప్రకృతి ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం



సుందరయ్యపేటలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం అనకాపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ వర్మ అభిప్రాయపడ్డారు.

మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులు, స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు, 30 రకాల విత్తనాలతో పండించే వివిధ రకాల ఆహార ఉత్పత్తుల గురించి వివరించారు. పురుగు మందుల వినియోగం లేని పంటల సాగు, కిచెన్ గార్డెన్ పెంపకంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ అనకాపల్లి డివిజన్ సిబ్బంది అప్పలరాజు, సత్యారావు, రమణ, రేవతి, సాయి, చంటి పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపునకు సమష్టిగా పనిచేయాలి



ప్రచారం చేస్తున్న నాయకులు

డుంబ్రిగుడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని అరమ పంచాయతీలో నాయకుడు తుంనాథ్ తదితరులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ ప్రచార పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. సుధాకర్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా జాతర



పూజలు చేస్తున్న భక్తులు

ఎటపాక: మండలంలోని పాండురంగాపురం గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. ప్రతీ రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల నుంచి ఆదివాసీలు వేల సంఖ్యలో తరలివచ్చారు. వన దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివాసీ నేతలు చందాలింగయ్య, కుంజా సత్యవతితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ఈ జాతరకు వచ్చి పూజలు చేశారు. ప్రధాన పూజారి అపక సీతారాములు, పొడియం కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు మృతికి సంతాపం



మక్బూల్ (ఫైల్)

చింతూరు: మండల కేంద్రాని కి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ పీసీసీ సభ్యుడు హాజీ మహ్మద్ మక్బూల్(88) తాడేపల్లిగూడెంలో మృతి చెందారు. నాటి తరంలో సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మాజీ మంత్రి జలగం ప్రసాదరావు అనుచరుడిగా ఆయన పనిచేశారు. చింతూరు యాసీన్ మసీదు కమిటీ అధ్యక్షుడిగా ఉంటున్న ఆయన వయోభారంతో బుధవారం మృతి చెందారు. ఆయన కుమారుడు ఎండీ హబీబ్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. మక్బూల్ మృతికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు సంతాపం తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ అరుణ్‌కిరణ్

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలోని వారపు సంతలో ఆటో, జీపు డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ అరుణ్‌కిరణ్ బుధవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సంత జరిగే ప్రాంతాల్లో ఆటోలు, జీపుల అస్తవ్యస్త పార్కింగ్ వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశాల మేరకు నిర్దేశించిన స్థలంలోనే ఆటోలు, జీపులు తదితర ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా డ్రైవర్లు సహకరించాలని సూచించారు. అనంతరం వాహన తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి రూరల్: రాజుపాలెంలో స్వయంవ్యక్తమైన ప్రత్యక్ష దైవం సూర్యనారాయణమూర్తి ఆలయాన్ని బుధవారం పలువురు భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దొడ్డిపట్ల కల్యాణ్ కుమార్ నిత్యపూజల అనంతరం ప్రత్యేక అర్చనలు చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చిన ఉపమాక గ్రామానికి చెందిన సీనియర్ గురుభవానీ దవరసింగి రాంబాబుకు ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల బాబూరావు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అర్చకులు ఆదిత్య పారాయణం చేశారు. శేషవస్త్రం వేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తమ్మంగుల పంచాయతీ పరిధిలోని కుమ్మరివంచుల, సుద్దగరువు, కోండపల్లిగున్నలు, జోడుమామిడి, బోర్రుంగులా, వర్తనపల్లి తదితర గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆయా గ్రామాల్లో 350 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలు, ప్రజాదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, పచ్చమీడియా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో మన ప్రభుత్వం భారీ మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు తమర్బ నర్సింగరావు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ కోరాబు అనూషా దేవి, సర్పంచ్ లక్ష్మయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యులు బాబూరావు, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

డుంబ్రిగుడ: మండలంలోని అరమ, గుంటసీమ, రంగిలిసింగి, కుట్టి, కుజభంగి, లైగండ గ్రామాల్లో హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం బుధవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటిస్తున్నానని, సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాయకులు దేవగున్, త్రినాథరావు, పూర్ణచందర్, భాస్కర్ ,పశురాం, కృష్ణారావు, లింగేశ్వరరావు, వెంకటరావు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



గాసిరావును పరామర్శిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ మినుములపుట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిముడు గాసిరావుకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు బుధవారం మినుములపుట్టు గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించి, అనారోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. గాయాలు తగ్గే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు నీలకంఠం, గంగాధర్, ఎంపీటీసీ సభ్యురాలు కమల, నేతలు జగబందు, తిరుపతిరావు, జయదేవ్, కొండలరావు, నాగేశ్వరరావు, దేవా, భగత్‌రాం, రాంప్రసాద్, పద్మారావు తదితరులున్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



సమ్మర్ క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మ, ఎంపీడీవో లోహిత్ జయసాగర్

జి.మాడుగుల: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ కొర్రా పద్మ, ఎంపీడీవో లోహిత్ జయసాగర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామాల్లోని పాడైన బోర్లకు మరమ్మతు చేపట్టాలని ఆదేశించారు. మండలంలో ఈ నెల 9 నుంచి మార్చి 26వ తేదీ వరకు 45రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడ ఉన్నా గుర్తించి, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, కార్యదర్శులు నాయుడు, చిన్నంనాయుడు, బోర్ మెకానిక్ బాలు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పాడేరు రూరల్ : వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎల్.సుందర్‌రావు డిమాండ్ చేశారు. పాడేరు జిల్లా ఆస్పత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వైద్యా విధాన పరిషత్ పరిధిలో పాడేరు, చింతపల్లి, ముంచంగిపుట్టు, అరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.16వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ మినహాయించి మిగిలిన వేతనాలు నేరుగా కార్మికులకు చెల్లించాలని, ముఖ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.కృష్ణారావుకు అందజేశారు. పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు ముత్యాలమ్మ, గాటీలమ్మ, లక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న అరకులోయ సీఐ దేముడుబాబు

అరకులోయ రూరల్: మండలంలోని ప్రభుత్వ ఆర్ఐటీఐ సంస్థల ప్రాంగణంలో బుధవారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక(సీఆర్పీఫ్) జిల్లా కన్వీనర్ డాక్టర్ బాక లవకుశ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం జీవితాలను బంగారు మయం చేద్దాం అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా అరకు సీఐ దేముడుబాబు మాట్లాడుతూ నేటి యువతరం మాదక ద్రవ్యాల వల్ల నేటి యువత, విద్యార్థులు జీవితాలను ఛిత్రం చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అరకు ఎస్ఐ సంతోష్, బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ ప్రసన్నకుమార్, ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.